క్లుప్తంగా

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు



దత్తాత్రేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణార్థం శ్రీశైలదేవస్థానం ఆధ్వర్యంలో గురువారం ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన దత్తాత్రేయస్వామికి విశేష పూజలను అధికారులు, అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

ఆత్మకూరులో 10 మి.మీ. వర్షం

ఆత్మకూరు: మండలంలో గురువారం 10 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. వర్షపు నీరు రోడ్లపై ప్రవహించాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

చెత్త నుంచి సంపద సృష్టి



రేగడగూడురులో సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి

వెలుగోడు: పంచాయతీల్లో నిర్మించిన చెత్త నుంచి సంపద కేంద్రాల ద్వారా సంపద సృష్టించవచ్చని ఎంపీడీఓ మధుసూదనన్‌రెడ్డి అన్నారు. గురువారం రేగడగూడూరు, గుంతకందాల గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను స్వచ్ఛంద్రా– స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో, మండల అధికారులు సందర్శించారు. అలాగే సచివాలయాలను తనిఖీ చేశారు. ఎంపీడీవో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో తడిచెత్త పొడిచెత్త వేరు చేయడం, సేంద్రియ ఎరువును తయారు చేయడం, వాటిని అమ్మకం గురించి చర్చించారు. అనంతరం సచివాలయ సిబ్బందితో సమావేశమైన ఎంపీడీవో సకాలంలో అన్ని రకాల సర్వేలు పూర్తి చేయాలని ఆదేశించారు.

ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక

మహానంది: మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఇద్దరు ఎంపికైనట్లు మండల విద్యాశాఖాధికారి రామసుబ్బయ్య తెలిపారు. మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురంలోని ఏపీ మోడల్ స్కూల్ నుంచి మహమ్మద్ సలీం, మసీదుపురం ఎంపీపీ పాఠశాల నుంచి జి.నాగేంద్ర కుమార్‌లు ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డులకు ఎంపికయ్యారని చెప్పారు. ఎంపికైన వారిని తోటి ఉపాధ్యాయులు, బంధు మిత్రులు అభినందించారు.

వ్యవసాయ విద్యుత్ వేళల్లో మార్పులు

మహానంది: తిమ్మాపురం సబ్‌స్టేషన్ పరిధిలో వ్యవసాయ విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు చేసినట్లు మండల ఏఈఈ ప్రభాకర్‌రెడ్డి గురువారం తెలిపారు. అబ్బీపురం ఫీడర్‌లో రాత్రి 12 గంటల నుంచి ఉదయం 9 వరకు, పుట్టుపల్లె, కృష్ణనంది ఫీడర్లలో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. రైతులు గమనించాలని కోరారు.

భక్తి శ్రద్ధలతో సరిగెత్తు



పీర్ల చావిడిలో కొలువు దీరిన మౌలాలి స్వామి పీర్లు

పాములపాడు: మండలంలోని మిట్టకందాల గ్రామంలో మౌలాలి స్వామి సరిగెత్తును భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గురువారం పీర్ల చావిడిలో మౌలాలి పీరు కొలువుదీరగా భక్తులు కాయ, దట్టీలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అర్ధరాత్రి సమయంలో పీరు అగ్ని గుండం ప్రవేశం చేసి గ్రామంలో ఊరేగారు. రాత్రంతా స్వామి వారి సవారి కొనసాగింది.

ఉపాధ్యాయుడికి సన్మానం



హాజీ బాషాను అభినందిస్తున్న సహచర సిబ్బంది

బండి ఆత్మకూరు : మండలంలోని మోడల్ స్కూల్ రసాయన శాస్త్ర ఉపాధ్యాయుడు మేసన్ హాజీ బాషా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. ఈ మేరకు ఆయనను గురువారం స్కూల్ ప్రిన్సిపాల్ అబ్దుల్ రఫీ ఆధ్వర్యంలో సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు.

కేఆర్‌ఎంబీ కర్నూలులో ఏర్పాటు చేయాలి



కేఆర్‌ఎంబీ చైర్మన్ బిపి.పాండే, సభ్యుడు కెకె.జాన్ గిడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: కృష్ణా రివర్ మేనేజ్‌మెంటు బోర్డును కర్నూల్లో ఏర్పాటు చేసి, రాయలసీమ రైతులకు అన్యాయం చేయకుండా సాగునీటిని అందించాలని రాయలసీమ సాగునీటి సాధన కమిటీ అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి కోరారు. గురువారం పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ పరిశీలనకు వచ్చిన కేఆర్‌ఎంబీ బోర్డు చైర్మన్ బీపీ.పాండే, కమిటీ మెంబర్ కెకె.జాన్‌గిడ్‌ను కలిసి వారికి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. అనంతరం రాయలసీమ రైతాంగానికి జరుగుతున్న అన్యాయాన్ని వారికి వివరించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ కృష్ణా బోర్డును కర్నూల్లోనే ఏర్పాటు చేయాలని బోర్డు చైర్మన్‌ను కోరగా రాష్ట్ర ప్రభుత్వం విజయవాడ, విశాఖపట్నంలో ఏర్పాటు చేయాలంటుందని, ఆ రెండింటిలో ఎక్కడ ఏర్పాటు చేయాలనే విషయంపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదని చెప్పారని తెలిపారు. విజయవాడ, విశాఖపట్నం లలో బోర్డు ఏర్పాటు చేస్తే ఇప్పటికే అన్యాయానికి గురవుతున్న రాయలసీమ రైతాంగానికి సాగునీరు అందక మరింత దుర్భర పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందని వారికి తెలియజేశామన్నారు. పోతిరెడ్డిపాడు నుంచి 44వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసుకునే అవకాశం ఉన్నా, ప్రస్తుతం కేవలం 30 వేల క్యూసెక్కుల నీటిని మాత్రమే సరఫరా చేస్తుండటంతో దిగువ ప్రాంతాల్లోని ప్రాజెక్టులు నిండక, రైతాంగానికి సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుందూనది మీదుగా అధికంగా సాగు నీటిని తరలిస్తుండటంతో సమీపంలోని పొలాలు మునకకు గురై రైతులు నష్టపోతున్నారని చెప్పగా..అది అంతర్గత విషయమని, దాన్ని జిల్లాల్లోని అధికారులతో పరిష్కరించుకోవాలని చైర్మన్ సూచించారన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలు జలచౌర్యానికి పాల్పడకుండా కేఆర్‌ఎంబీ నిబంధనలను కఠినంగా అమలు చేయాలని కోరామన్నారు. తెలంగాణ రాష్ట్రం నిబంధనలను ఉల్లంఘించి విద్యుత్ ఉత్పత్తి చేస్తుండటంతో శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం వేగంగా తగ్గి పోతిరెడ్డిపాడు నుంచి నీటిని విడుదల చేసుకోలేని దుస్థితి నెలకొంటోందని వారి దృష్టికి తెచ్చామన్నారు. పోతిరెడ్డిపాడు నుంచి జలచౌర్యం జరుగుతుందని తెలంగాణ పేర్కొనటం హాస్యాస్పదంగా ఉందన్నారు. కమిటీ ఉపాధ్యక్షుడు వైఎస్.రెడ్డి, కార్యదర్శి మహేశ్వరరెడ్డి ఉన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



గోకవరంలో రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎంను సన్మానిస్తున్న ఎస్‌బీఐ మేనేజర్ కిరణ్‌కుమార్



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

మహానంది: మహానంది మండలంలోని వివిధ పాఠశాలల్లో ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలు నిర్వహించారు. తమ్మడపల్లెలోని మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం రామఫక్కిరెడ్డి ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులు ఎంతో కృషి చేస్తారన్నారు. అలాంటి వారిని సన్మానించుకోవడం మన బాధ్యత అన్నారు. తిమ్మాపురం ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలు వైభవంగా జరిగాయి.

భవిష్యత్ మార్గ నిర్దేశకుడు గురువే

కొత్తపల్లి: విద్యార్థుల భవిష్యత్ మార్గ నిర్దేశకుడు గురువేనని హెచ్‌ఎం సుబ్బారాయుడు అన్నారు. గురువారం మండలంలోని గోకవరం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ముందుగా మొదటి ఉపరాష్ట్రపతి, రెండో రాష్ట్రపతి అయిన సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులను సన్మానించారు.

నందికొట్కూరు: ప్రతి ఒక్కరూ గురువులను గౌరవించాలని స్టేట్ బ్యాంక్ మేనేజర్ కిరణ్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులను పట్టణంలోని సుబ్బారావుపేట స్టేట్ బ్యాంక్ మేనేజర్ ఘనంగా సన్మానించారు. అలాగే ప్రభుత్వ హైస్కూల్, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ రఘురామాచార్యులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులకు సరిపడా యూరియా అందిస్తాం

ఆత్మకూరు: డివిజన్‌లోని రైతులకు సరిపడా యూరియాను అందిస్తామని, రైతులెవరూ ఆందోళన చెందవద్దని ఏడీఏ హేమలత అన్నారు. గురువారం ఆమె స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యవసాయ అధికారి ఆదేశాల మేరకు ఇంతవరకు ఆత్మకూరు డివిజన్ పరిధిలోని రైతుసేవా కేంద్రాల ద్వారా సుమారు 1916 మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేయడం జరిగిందన్నారు. శుక్ర, శనివారాల్లో సుమారుగా డివిజన్‌కు 525.35 మెట్రిక్ టన్నుల యూరియాను పంపించాలని ప్రభుత్వానికి నివేదించామన్నారు.

ఫర్హానాకు డాక్టరేట్

మహానంది: గాజులపల్లె గ్రామానికి చెందిన ఫర్హానాకు శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య ఆధ్వర్యంలో భౌతిక శాస్త్రంలో ఫిజికల్ స్టడీస్ ఆన్ ద ప్రాపర్టీస్ ఆఫ్ ఏఐ డోప్ జెడ్‌ఎన్‌ఓ ఫిలిమ్స్ బై ఆర్ ఎఫ్ మ్యాగ్నట్రాన్ స్పాటరింగ్ అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ అందుకున్నట్లు తండ్రి పఠాన్ మాలిబాషా వెల్లడించారు

విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలి

ఆత్మకూరు: కొత్తపల్లి మండల విద్యార్థుల సౌకర్యార్థం మధ్యాహ్నం 3 గంటలకు మాడుగులకు విద్యార్థి బస్సును ఏర్పాటు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు కె.దినేష్‌కుమార్ కోరారు. ఈ మేరకు గురువారం ఆత్మకూరులోని ఏపీఎస్‌ఆర్టీసీ డిపో సీఐ కోటయ్యనాయక్‌ను కలిసి వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ బస్సు సర్వీసులు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు తేజ, జగదీష్, లక్ష్మణ్, సంజయ్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

సాయపడే గుణం అలవర్చుకోవాలి

పాములపాడు: విద్యార్థి దశ నుంచే తోటి వారికి సాయమందించే గుణాన్ని అలవర్చుకోవాలని కరెస్పాండెంట్ శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక శ్రీశారదా విద్యానికేతన్ హైస్కూలు విద్యార్థులు అంధులు,అనాథల కోసం రూ.48వేల ఆర్థిక సాయాన్ని ఐ్రటోడ్ సోచ్ ప్రతినిధులకు అందజేశారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఎ.శోభారాణి

నందికొట్కూరు: ఈ నెల 13వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఎ.శోభారాణి తెలిపారు. గురువారం పట్టణంలోని కోర్టు చాంబర్‌లో బార్ అసోసియేషన్ సభ్యులు, పోలీసులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. రాజీకి అర్హులైన సివిల్, క్రిమినల్ తగాదాలకు సంబంధించి ఇప్పటికే ముందస్తు బెంచ్‌లు ఏర్పాటు చేశామన్నారు. కక్షిదారులకు ఈ సదావకాశాన్ని వినియోగించేందుకు సహకారం అందించాలని చెప్పారు. ఎలాంటి ఖర్చు లేకుండా సులభమైన రీతిలో అప్పీలు లేని తీర్పును లోక్ అదాలత్ ద్వారా పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేద్కర్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శరబయ్య, ఏపీపీ సుస్మిత, న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.

పెద్ద వాగుపై హై లెవెల్ బ్రిడ్జి నిర్మించాలి



మాట్లాడుతున్న యేసురత్నం

కొత్తపల్లి: శివపురం, లింగాపురం గ్రామాల మధ్యనున్న పెద్దవాగు (ఎద్దులేరు వాగు)పై హై లెవెల్ బ్రిడ్జి నిర్మించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.యేసురత్నం, మండల కార్యదర్శి ఎన్.స్వాములు డిమాండ్ చేశారు. గురువారం శివపురం సింగరాజు పల్లి గ్రామంలో పర్యటించి పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ ఏటా ఎద్దులేరువాగు ఉధృతంగా ప్రవహించి శివపురం నుంచి జానాల గూడెం వరకు ఉన్న అన్ని గ్రామాలకు రాకపోకలు స్తంభించి ప్రజలు ఇబ్బందులు గురవుతున్నారన్నారు. వాగు దాటే సందర్భంలో నీటి ఉధృతికి గతంలో ఇద్దరు కొట్టుకుపోయి చనిపోయారని గుర్తు చేశారు. హై లెవెల్ బ్రిడ్జి నిర్మించాలని 20 సంవత్సరాల నుంచి ఆందోళనలు చేస్తున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. నాయకులు సంజీవ రాయుడు, ఎన్ దేవకుమార్, ఎన్ గోపాల్ పాల్గొన్నారు.

అలరించిన భజన



భక్తి గీతాలను ఆలపిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళావేదికపై నంద్యాల జిల్లా పగిడ్యాలకు చెందిన శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున భజన సేవాసమితి వారు భజన కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో శరణుగణేశ, గణపయ్య నీ రూపం, శ్రీశైలవాస మల్లికార్జున, లింగాష్టకం, శ్రీశైలం శివమయం తదితర భక్తిగీతాలకు ఈశ్వరమ్మ, సుబ్బయ్య, వెంకటస్వామి, శేఖర్, మల్లారెడ్డి, శివరాములు, నాగార్జున, పరశురాముడు, రాము, లక్ష్మీదేవి, స్వర్ణమ్మ, శ్రీనివాసులు తదితరులు ఆలపించారు.

వేలంలో ఆలయానికి ఆదాయం

నంద్యాల (వ్యవసాయం): శ్యామ కాల్వ వద్దున్న శ్రీ ప్రథమ నందీశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించిన బహిరంగ వేలం పాటలో అత్యధిక ఆదాయం లభించినట్లు ఈవో రామానుజన్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయానికి సప్లయర్ సామాన్లు వేలం పాటలో సంవత్సరానికి రూ. 10 లక్షలు, అదేవిధంగా ఆలయానికి పూల డెకరేషన్ లైటింగ్ వేలంపాటలో రూ. 15.10 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు.

లోడ్‌బర్మ్ పెండింగ్ పనులకు ప్రతిపాదనలు

పాణ్యం: గోరుకల్లు జలాశయానికి ఎక్స్‌పర్ట్ కమిటీ సూచనల మేరకు గతంలో లోడ్‌బర్మ్ పనులు చేపట్టారు. ఇందుకు కోసం అప్పట్లో రూ.45 కోట్లు కేటాయించి 2450–2950 వరకు పనులు చేపట్టారు. సగం వరకు పనులు చేశారు. తిరిగి పూర్తి స్థాయి పనులు చేసేందుకు అధికారులు గత నెలలో రూ.23 కోట్లకు ప్రతిపానదలు పంపారు. దాదాపుగా 500 మీటర్ల వరకు ఈ లోడ్‌బర్మ్ పనులు చేపడతారు.

అందుబాటులో యూరియా

పాములపాడు: మండలంలోని అన్ని రైతు సేవాకేంద్రాల్లో ఈ నెల 6వ తేదీన యూరియా అందుబాటులో ఉంటుందని మండల వ్యవసాయాధికారి మహేశ్వరరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 5న మండలంలోని మద్దూరు గ్రామంలో నలుగురు ప్రైవేటు డీలర్లకు 2.97 మెట్రిక్ టన్నుల చొప్పున మొత్తం 11.97 మెట్రిక్ టన్నులు, మండల కేంద్రంలోని మన గ్రోమోర్ సెంటర్‌కు 11.97 మెట్రిక్ టన్నులు రానుందని చెప్పారు. అలాగే 6 వతేదీన అన్ని రైతు సేవా కేంద్రాలకు యూరియా రానున్నదన్నారు. 9,10 వ తేదీల్లో 370 మెట్రిక్ టన్నుల యూరియాకు ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు. యూరియా గురించి రైతులు ఆందోళన చెందొద్దన్నారు.

రైతన్నలూ.. ఆందోళన చెందొద్దు

కొత్తపల్లి: మండలంలోని రైతన్నలు యూరియా కొరతపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మండల వ్యవసాయాధికారి అమిరున్నీసా బేగం అన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. మండలంలో యూరియా కొరత త్వరలో తీరనుందన్నారు. ఈ వారం జిల్లాకు 3,600 మెట్రిక్ టన్నులు, వచ్చే వారాల్లో 2,400 మెట్రిక్ టన్నుల యూరియా రానుందని చెప్పారు.యూరియ అవసరమైన రైతులు 1బీ, ఆధార్ తో రైతుసేవా కేంద్రాల్లో రైతుల వేలి ముద్రలతో అధికారుల సహకారంతో పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

ప్రభుత్వాలకు గుణపాఠం తప్పదు



మాట్లాడుతున్న రమేష్‌కుమార్

నందికొట్కూరు: ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు గుణపాఠం తప్పదని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ హెచ్చరించారు. గురువారం స్థానిక జైకిసాన్ పార్కులో సీపీఎం ప్రాంతీయ వర్క్‌షాపు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్నాయని, త్వరలోనే ప్రజల నుంచి తిరుగుబాటు మొదలవుతుందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామని, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పిస్తామని, పేదరిక నిర్మూలిస్తామని హామీలిచ్చారని గుర్తు చేశారు. అధిక ధరలను అరికడతామని చెప్పి అధికారంలోకి రాగానే అన్నింటినీ ఇష్టానుసారంగా ధరలు పెంచడం దుర్మార్గమన్నారు. బీజేపీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు రూ.16 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసిందని, పేదలపై మాత్రం అధిక ధరలతో భారం మోపుతోందని మండిపడ్డారు. నాయకులు నాగేశ్వరరావు, స్వామన్న, ఫక్కీర్‌సాహెబ్, కర్ణ, గోపాలకృష్ణ, నాగమణి, రంగమ్మ, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు మిషన్లు ఇవ్వాలి



మున్సిపాలిటి కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

నందికొట్కూరు: కుట్టు శిక్షణ పొందిన బీసీ మహిళలకు కూటమి ప్రభుత్వం వెంటనే కుట్టు మిషన్‌లు ఇవ్వాలని ప్రగతిశీల మహిళా సంఘం (ఐప్వా) జిల్లా నాయకురాళ్లు బీబీ, లక్ష్మీదేవి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ బేబికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆగస్టు 15న శిక్షణ పొందిన మహిళలందరికీ మిషన్ ఇస్తామని చెప్పిందని, అయితే నేటికీ ఇవ్వలేదని మండిపడ్డారు. 70 రోజుల పాటు శిక్షణ పూర్తి చేసినా తమకు లాభం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు వెంకటలచమ్మ, సుశీలమ్మ, రాణమ్మ, మద్దమ్మ, పార్వతమ్మ, మల్లమ్మ, పాల్గొన్నారు.

జయరాం.. నోరు అదుపులో పెట్టుకో



పటేల్ సెంటర్‌లో గుమ్మనూరు జయరాం చిత్రపటాన్ని దహనం చేస్తున్న సీపీఎం నాయకులు



ఆత్మకూరులో ధర్నా నిర్వహిస్తూ మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్

నందికొట్కూరు: గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూర్ జయరాం నోరు అదుపులో పెట్టుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ హెచ్చరించారు. గురువారం పట్టణంలోని పటేల్ సెంటర్‌లో గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూర్ ఫొటోలను సీపీఎం నాయకులు దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులకు అండగా నిలిచిన రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డిని ఇష్టానుసారంగా దూషించడం దుర్మార్గమన్నారు. అరగంటలో ఆందోళన విరమించుకోకపోతే తరిమికొడతానని ఫోన్‌లో హెచ్చరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అసభ్య పదజాలంతో దూషించడం ఆయన నైజాన్ని చాటుతుందన్నారు. ఉపాధి కల్పన పేరుతో కంపెనీ యజమానులతో కుమ్మక్కై కోట్లాది రూపాయలు అక్రమంగా సంపాదించడమే ధ్యేయంగా రైతులను మోసం చేయడాన్ని సహించమని స్పష్టం చేశారు. నాయకులు నాగేశ్వరరావు, ఫక్కీర్‌సాహెబ్ పాల్గొన్నారు.

గుంతకల్ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి

ఆత్మకూరు: రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డిపై గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్‌లు అన్నారు. గుంతకల్ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని గురువారం ఆత్మకూరులోని కర్నూలు–గుంటూరు జాతీయ రహదారిపై రైతు సంఘం మండల అధ్యక్షులు మాబాషా అధ్యక్షతన రాస్తారోకో నిర్వహించారు. వారు మాట్లాడుతూ అనంతపురం జిల్లా గుంతకల్లు నియోజకవర్గంలోని గుత్తి, పామిడి మండలాల్లోని ఐదు గ్రామాల్లో సోలార్ విండ్ పవర్ ప్లాంట్లను రెన్యూ విక్రమ్ అనే సంస్థ ఏర్పాటు చేస్తుందని, దీనికి లీజు పద్ధతిలో దళారుల చేత అధికార పార్టీ నేతలు బెదిరింపులతో భూసేకరణ సాగిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో నిర్వాసిత గ్రామాల్లో పరిశీలనకు రైతులతో కలిసి వెళ్లిన ఏపీ రైతు సంఘం నాయకులను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఫోన్‌లో బండ బూతులు తిడుతూ బెదిరింపులకు గురిచేశారన్నారు. రైతు సంఘం నాయకులకు ఎమ్మెల్యే బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి వీరన్న, సీఐటీయూ పట్టణాధ్యక్ష కార్యదర్శులు సద్దాం ,రామ్‌నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు దినేష్ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మనూరు క్షమాపణలు చెప్పాలి

మహానంది: రైతుల సమస్యల కోసం నిజాయితీగా పోరాడుతూ రైతులు, కార్మికుల కోసం జీవితాన్ని అంకితం చేసిన ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డిని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం బూతులు తిట్టడం సిగ్గుచేటని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు, సీపీఎం మండల కార్యదర్శి కోటకొండ బాషా ఆగ్రహం వ్యక్తం చేశారు. గాజులపల్లెలోని ప్రధాన రహదారిపై గురువారం వారు నిరసన వ్యక్తం చేశారు. వెంటనే గుమ్మనూరు జయరాం క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. నాయకులు మద్దిలేటి, నాగార్జున, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

దళితుల భూమి వారికే చెందేలా చూడాలి



ఆర్డీఓ నాగజ్యోతికి వినతి పత్రం అందజేస్తున్న జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ లింగాల నాగరాజు

ఆత్మకూరు: దళితుల భూమి దళితులకే చెందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ లింగాల నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతికి వేంపెంట గ్రామస్తులు ఆనందరావు, సామేలు, యువరాజు, ప్రసాద్‌లతో కలిసి వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ వేంపెంట గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన స్థలాల గురించి గతంలో చాలాసార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ప్రభుత్వం దళితుల కోసం కేటాయించిన భూమిని అదే గ్రామానికి చెందిన గంటాస్వామిరెడ్డి అనే భూస్వామి దొంగ రిజిస్టర్ చేయించుకున్నాడని ఆరోపించారు. భూమిని జిల్లా సర్వే ద్వారా సర్వే చేయించి దళితులకు న్యాయం చేయాలని కోరారు.

ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయం చూపండి



ధర్నా నిర్వహిస్తున్న ఆటో డ్రైవర్లు

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్రం ప్రభుత్వం మహిళలకు ఉచితబస్సు కల్పించడంతో ఆటో, వ్యాన్లు, జీపు డ్రైవర్ల ఉపాధికి గండిపడిందని, ప్రత్యామ్నాయం చూపాలని ఏఐటీయూసీ నంద్యాల జిల్లా కార్యదర్శి రఘురాంమూర్తి, డివిజన్ కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. గురువారం ఆటోడ్రైవర్లతో కలిసి పెద్దఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు వచ్చాక ఇంధనం, నిత్యావసర ధరలు ఆకాశాన్నంటాయన్నారు. దీనికి తోడు పెంచిన జరిమానాలు ఆటో డ్రైవర్లకు కునుకు లేకుండా చేస్తున్నాయన్నారు. చంద్రబాబు ప్రభుత్వం పెట్టిన ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో డ్రైవర్లు రోడ్డున పడ్డారన్నారు. వాహనమిత్ర పథకం ద్వారా ఆటో డ్రైవర్లకు రూ.25 వేలు ఇవ్వాలని డిమాండు చేశారు.

దివ్యాంగురాలికి చక్రాల కుర్చీ అందజేత

నంద్యాల (వ్యవసాయం): పట్టణంలోని 25వ వార్డులో నివసించే దివ్యాంగురాలు ప్రభావతికి జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చక్రాల కుర్చీ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా దివ్యాంగుల సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ.. ఆమెకు పెన్షన్ మంజూరయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు రమణయ్య, ఏవీఆర్ ప్రసాద్ పాల్గొన్నారు.

అలరించిన పద్య పఠన పోటీలు



తెలుగు పద్యాలు ఆలపిస్తున్న బాలిక

నంద్యాల (వ్యవసాయం): కళారాధన సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో గురువారం వివేకానంద ఆడిటోరియంలో నిర్వహించిన పద్యపఠనం పోటీలు అలరించాయి. ×మాతృభూమికి కళార్చన₹పేరుతో జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో పద్య పఠనం పోటీల్లో 110 మంది బాలలు పాల్గొన్నారు. రాగయుక్తంగా పద్యాలాపనతో అలరించారు. 40 మంది చిన్నారులు ఆకట్టుకునే హావభావాలతో పద్యాలు ఆలపించారు. న్యాయ నిర్ణేతలుగా సుజాత, చంద్రహాసరెడ్డి, గోపాల కృష్ణ, కమలాకర్, నీలకంఠమాచారి, ప్రసాద్ వ్యవహరించారు. టౌన్ హాల్ ప్రాంగణంలో శుక్రవారం తెలుగు, హిందీ, ఆంగ్ల భాషలలో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాలలో చక్కటి చేతి రాత పోటీలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో లైఫ్‌క్లబ్ సభ్యులు నాగరాజు, సుబ్బారావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 21 నుంచి 25 వరకు పంజాబ్, హర్యానా ఉమ్మడి రాజధాని చండీగఢ్ నగరంలో జరగబోయే సీపీఐ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు పిలుపునిచ్చారు. గురువారం సీపీఐ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రఘురాం మూర్తి అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం యూరియా ఎరువులు కొరత సృష్టించి రైతులకు సక్రమంగా పంపిణీ చేయడంలో విఫలమైనందుకు 8న రాష్ట్రవ్యాప్తంగా అన్ని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య, రాధాకృష్ణ, రాముడు, ప్రసాద్, భాస్కర్, నాగరాముడు, భార్గవ్ పాల్గొన్నారు